

విద్యుత్ దీపాల వెలుగులో ఫాతిమా చర్చి

విద్యుత్ వెలుగుల్లో హనుమకొండలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి

కాజీపేట ఫాతిమా చర్చి పశువులపాకలో బాలయేసు, భూపాలపల్లిలోని సుభాష్‌కాలనీలో గల బెత్లెస్థ మందిరంలో ఏర్పాటుచేసిన పశువుల పాక

**బుధవారం క్రిస్మస్ పండుగను జరుపుకొనేందుకు క్రైస్తవులు సిద్ధం కాగా, ఉమ్మడి జిల్లాలోని చర్చిలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ప్రార్థనా మందిరాలతో పాటు బాలయేసు, పశువుల పాకను రంగురంగుల విద్యుత్ దీపాలు, స్టార్స్‌తో అలంకరించి అందంగా తీర్చిదిద్దగా జిగేల్‌మంటూ మెరిసిపోయాయి.**


భూపాలపల్లి మండలం కొత్తపల్లిలో యాసంగి నాట్లు వేస్తున్న మహిళలు

**అన్నదాతల విషయంలో** రాష్ట్ర ప్రభుత్వ తీరు 'చెప్పేది కొండంత.. చేసేది పిసరంత' అన్న చందంగా మారింది. చివరి ధాన్యపు గింజ వరకు కొంటామని ఆర్భాటంగా ప్రచారాలే తప్ప.. ఆచరణలో కనిపించడం లేదు. వరికోతలు పూర్తయి దాదాపు నెల రోజులు కావొస్తున్నా ఇప్పటివరకు సగం ధాన్యం కూడా కొనలేదు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్న ధాన్యాన్ని కాపాడుకోలేక రైతులు అరిగోస పడుతున్నారు. ధాన్యపు రాశులతో కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నారు. వర్ష భయంతో వణికిపోతున్నా కనుకరించే నాథుడే కరువయ్యారని ఆవేదన చెందుతున్నారు.

-మహబూబాబాద్/ జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ)


చిన్నగూడూరు: కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన వడ్ల కుప్పలపై టార్పాలిన్లు కప్పిన రైతులు

- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కొన్నది 41.75 మెట్రిక్ టన్నులే..
- ఇంకా కొనాల్సింది 1.59 లక్షల మెట్రిక్ టన్నులు
- ఇప్పటికే మొదలైన యాసంగి వరినాట్లు
- వర్ష భయంతో దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు
- నేరుగా మిల్లుల్లో విక్రయాలు
- ప్రభుత్వం నుంచి స్పందన కరువు

# కొన్నది కొంతే..

## లక్ష్యం చేరని ధాన్యం కొనుగోళ్లు

### సగం వడ్లు కొనుగోలు కేంద్రాల్లోనే..


ములుగు: బైక్‌పై టార్పాలిన్లు తీసుకెళ్తున్న రైతు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మందకొడిగా సాగుతున్నది. ఇప్పటి వరకు కనీసం సగం ధాన్యం కూడా కొనలేదు. కొనుగోలు కేంద్రాల్లో వడ్ల నిల్వలు పేరుకుపోతున్నాయి. వాతావరణం చల్లబడడంతో మాయిశ్చర్ రాక అరిగోస పడుతున్నారు. ఓ పక్క మాయిశ్చర్ రాక.., మరోపక్క అకాల వర్షాలు ఆగం చేస్తున్నాయి. కేంద్రాల్లో అధికారులు ఇప్పటి వరకు 41.75 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. ఇంకా 1.59 లక్షల మెట్రిక్ ధాన్యాన్ని కొనాల్సి ఉన్నది. కొనుగోళ్ల లక్ష్యం చేరకపోవడం అధికారులకు తలనొప్పిగా మారింది. కేంద్రాల్లోనే ధాన్యం రాశులుండగా, మరోవైపు రైతులు యాసంగి వరినాట్లు ప్రారంభించారు. చాలా వరకు రైతులు ధాన్యంలో తేమశాతం రాక, సకాలంలో ధాన్యం డబ్బులు అందక, వర్షాల భయంతో ప్రైవేటుగా మిల్లులకు అమ్ముకుంటున్నారు. అలాగే కేంద్రాల్లో బస్తా ధాన్యం నుంచి 4 కిలోలు కోత విధిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఎక్కడా ప్యాడీ క్లీనర్‌ను ఉపయోగించడం లేదని, క్లీనర్లు పేరుకే అక్కడ ఉంచుతున్నారని తెలుపుతున్నారు. జిల్లాలో 203 ధాన్యం కొనుగోలు కేంద్రాలుండగా 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 41.75 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. ఇంకా 1.59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. 7574 మంది రైతుల నుండి రూ. 96.87కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించి రైతుల ఖాతాల్లో రూ. 56.24 కోట్లు జమ చేశారు. అలాగే 35825 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం కొనుగోలు చేసి రైతులకు డబ్బులు చెల్లించడంలో జాప్యం చేస్తున్నారు. అలాగే సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్న మూడు రైస్ మిల్లులను అధికారులు డిఫాల్ట్‌లో పెట్టారు. జిల్లాలోని రేగొండ మండలం భాగిర్థిపేటకు చెందిన దుర్గాభవాని, చిట్యాల మండలం ఒడితెల గ్రామానికి చెందిన మేఘన, రేగొండ మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస రైస్ మిల్లులను అధికారులు డిఫాల్ట్‌లో పెట్టి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

## అకాల వర్షం.. రైతన్నకు కష్టం

### కల్లాల వద్ద టార్పాలిన్లు లేక ఇబ్బందులు

ములుగు రూరల్, డిసెంబర్ 24 : అకాల వర్షంతో అన్నదాతలకు ఆగం చేస్తున్నది. మంగళవారం ఉమ్మడి జిల్లాలోని ములుగు, మహబూబాబాద్, హనుమకొండలోని పలు ప్రాంతాల్లో వాన కురవడంతో కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా పాట్లు పడాల్సి వచ్చింది. ఇప్పటికే కొద్దిరోజులు వాతావరణం చల్లబడడం, ఉదయం నుంచి మబ్బులు కుమ్ముకోవడంతో రైతులకు దిగులు పట్టుకోగా రాత్రివేళ మొదలైన వానతో ఇంకా దిగులు చెందారు. ములుగులో వ్యవసాయ కమిటీ ఆధ్వర్యంలో టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడ్డ రైతులు చేసేదేమీలేక పరదాలను కిరాయికి తెచ్చుకోవాల్సి వచ్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు టార్పాలిన్లు, గన్నీ బ్యాగులను అందించి సకాలంలో ధాన్యం మిల్లులకు తరలించాలని కోరుతున్నారు.


ములుగులో రాత్రి వర్షం పడడంతో ధాన్యపు బస్తాలపై టార్పాలిన్లు కప్పిన రైతులు

## మహబూబాబాద్‌లో 60శాతమే..

మహబూబాబాద్ జిల్లాలో వరి కోతలు పూర్తయి నెల రోజులు దాటినా ఇంకా ఎక్కడ చూసినా ధాన్యపు రాశులే కనిపిస్తున్నాయి. వడ్ల కొనుగోళ్ల విషయంలో అధికారులు చేతులెత్తేశారు. ఇప్పటివరకు 50 శాతం నుంచి 60 శాతం వరకు మాత్రమే కొనుగోళ్లు జరిగాయి. ఇంకా 40శాతం కొనాల్సి ఉన్నది. రెండు రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పెట్టడం ఎందుకు పెట్టడం లేదని పలువురు రైతులు నిర్వాహకులను ప్రశ్నిస్తే జిల్లాలో ఉన్న మిల్లులో ఖాళీగా స్థలం లేదు.. నిండిపోయాయి.. వేరే జిల్లా అలాట్ చేస్తే అప్పుడు ధాన్యం రవాణా చేస్తామని చెబుతున్నారు. ఒకవైపు తుఫాను ప్రభావంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు వచ్చాయి. మబ్బులతో అక్కడక్కడ చిరుజల్లులు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిస్తే మా పరిస్థితేంటని వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యానికి కాంటాలు పెట్టండి.. మేము వెళ్లిపోతామని చెప్పినా నిర్వాహకులు రైతుల మాట వినడం లేదు. ఇప్పటికే కాంటా అయిన ధాన్యం కేంద్రాల్లో నెట్టుకొట్టి అలాగే ఉన్నాయి. కొత్తగా కొనాల్సిన ధాన్యానికి కాంటాలు పెట్టడం లేదు. దీంతో రైతులు అష్టకష్టాలు తప్పడం లేదు. కొంత మంది రైతులు విధిలేని పరిస్థితిలో ప్రైవేట్ వ్యాపారులకు ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం మొద్దు నిద్రను వీడి కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# మిర్చి యార్డులో జీరో కాంటాలు..

- అధికారుల కనుసన్నల్లోనే తతంగం
- మార్కెట్ ఆదాయానికి గండి


జీరో కాంటా నిర్వహిస్తున్న దడువాయి

కాశీబుగ్గ, డిసెంబర్24: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మిర్చి యార్డులో మంగళవారం జీరో కాంటాలు నిర్వహించారు. మిర్చి తూకం వేసే క్రమంలో దడువాయి దగ్గర ఉండి జీరో కాంటా చేయడం గమనార్హం. కాగా సీజన్ ప్రారంభంలోనే ఇలా చేయడంతో మార్కెట్ ఆదాయానికి భారీగా గండి పడే అవకాశం ఉంది. ఇంత జరుగుతున్నా యార్డు ఇన్‌చార్జిలు, సూపర్‌వైజర్లు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కాగా, మార్కెట్‌కు సుమారు 3 వేల మిర్చి బస్తాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మార్కెట్ ప్రధాన కార్యాలయంలో జేడీఎం శ్రీనివాస్, డీడీఎం పద్మావతి, కార్యదర్శి నిర్మల సిబ్బందితో మిర్చి సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు.

# 54 కేంద్రాల్లో సీసీఐ పత్తి కొనుగోలు

- జనరల్ మేనేజర్ అర్జున్‌దావే

కాశీబుగ్గ, డిసెంబర్ 24: సీసీఐ వారు మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేస్తున్నట్లు సీసీఐ జనరల్ మేనేజర్ అర్జున్‌దావే తెలిపారు. 2024-25 సంవత్సరానికి పత్తి రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు వరంగల్ రీజినల్‌లోని 16 జిల్లాల్లో 54 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. వివరాలలకు రైతులు Cott-Ally మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. తేమశాతం 8 కంటే ఎక్కువ 12కు మించొద్దన్నారు. 12 శాతంలోపు ఉన్న పత్తికే మద్దతు ధర లభిస్తుందన్నారు. మరిన్ని వివరాలకు రైతులు 0870-2565077 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

































# అలుగు వేటగాళ్ల అరెస్టు

- నలుగురికి రిమాండ్.. జంతువు స్వాధీనం : ఎఫ్‌డీవో రమేశ్



వివరాలు వెల్లడిస్తున్న ఎఫ్‌డీవో రమేశ్,(ఇన్‌సెట్) స్వాధీనం చేసుకున్న అలుగు

ఏటూరునాగారం, డిసెంబర్ 24: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం భూపతిపూర్ అటవీ ప్రాంతంలో అలుగులను వేటాడుతున్న నలుగురిని అటవీశాఖాధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక అటవీ శాఖ డివిజనల్ అధికారి రమేశ్ వివరాలు వెల్లడించారు. అటవీ ప్రాంతంలో అలుగులను అక్రమంగా వేటాడుతున్నట్లు సమాచారం అందుకున్న అధికారులు భూపతిపూర్, కమాన్‌పల్లి పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అలుగులను వేటాడి వ్యాపారం చేస్తున్న భూపతిపూర్‌కు చెందిన కోరం నాగయ్య, కోరం పెంటయ్య, కోరం కృష్ణమూర్తి, భూపాలపల్లికి చెందిన వ్యాపారి చిడం రవిని అదుపులోకి తీసుకున్నారు. గతంలో నాగయ్య రెండు అలుగులను పట్టుకుని ఒకటి మంచిర్యాలలో అమ్ముతుండగా అటవీ శాఖాధికారులు స్వాధీనం చేసుకోగా, రెండోది ఇప్పుడు పట్టుకున్నారు. అంతేకాకుండా గొడ్డలి, కత్తి, వంట పాత్రలు స్వాధీనం చేసుకున్నారు. కోరం పెంటయ్య, కోరం కృష్ణమూర్తిలు తల్లి, పిల్లను వేటాడి పట్టుకున్నారు. ఇందులో పిల్లను అడవిలోనే వదిలి, తల్లిని మాత్రం చంపేసి తిన్నారు. భూపాలపల్లికి చెందిన పెద్ద వ్యాపారి దీని వెనుక ఉన్నాడని, అతడికి కాలు విరిగి వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడని, అతడిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌డీవో రమేశ్ తెలిపారు. అలుగు మాంసానికి అంతర్జాతీయ మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉందని, అందుకే వీటిని వేటాడుతున్నారని పేర్కొన్నారు. నలుగురిపై వన్యప్రాణుల రక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి, ములుగు మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్లు అబ్దుల్ రెహమాన్, అప్సర్ ఉన్నీసా, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

- కేజీబీవీలు, భవిత సెంటర్ల విద్యార్థులు చదువుకు దూరం
- సర్కారు పాఠశాలల్లో నిలిచిన బియ్యం సరఫరా
- మధ్యాహ్న భోజన బిల్లులదీ అదే పరిస్థితి
- ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు


చౌడారంలో పొలం పనుల్లో తాతకు సాయం చేస్తున్న విద్యార్థి మహేందర్


సమ్మెలో పాల్గొన్న ఎస్ఎస్‌ఏ ఉద్యోగులు

**కేజీబీవీలు, భవిత సెంటర్లలో బోధన బందయ్యింది. సమగ్రశిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) ఉద్యోగులు సమ్మె చేస్తుండడంతో జనగామ జిల్లాలో 15 రోజులుగా ఆయా పాఠశాలల్లో తరగతులు జరగడం లేదు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎమ్మార్సీ సిబ్బంది ఆందోళనలో పాల్గొనడంతో ఫైళ్లు ముందుకు కదలడం లేదు. దీంతో సర్కారు స్కూళ్లలో బియ్యం సరఫరా నిలిచిపోయింది. మధ్యాహ్న భోజన బిల్లులు ఆగిపోయాయి. పాఠశాలల్లో ఎప్పుడు బోధన ప్రారంభమవుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సమ్మెను విరమింపజేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.** - జనగామ, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ)

### పొలం బాటలో చిన్నారి..

ఇక్కడ కనిపిస్తున్న బాలుడి పేరు యాసారపు మహేందర్. స్వగ్రామం జనగామ మండలం చౌడారం గ్రామం. జిల్లా కేంద్రంలోని భవిత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు సమ్మెతో బడి బంద్దై 15 రోజులుగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. చదువు అటకెక్కడంతో వ్యవసాయ బావి వద్ద తాతతో కలిసి పొలం పనుల్లో నారు కట్టలు మోసే పనిలో నిమగ్నమయ్యాడు. ఇలా జిల్లాలో చాలా స్కూళ్లు, కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, మోడల్ స్కూళ్లు సరిగా తెరవక విద్యార్థులు చదువుకు దూరమై ఇంటి వద్దే ఉంటున్నారు.

***తాత్కాలిక సిబ్బందితో భోజన బిల్లులు***

కేంద్ర అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అప్‌డేట్ చేయడం, వంట కార్మికులకు బిల్లుల చెల్లింపు కోసం వచ్చే ఒత్తిడిని అధిగమించేందుకు తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేసి వంట బిల్లులు చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇదే జరిగితే బిల్లుల చెల్లింపులో అక్రమాలు, ఆన్‌లైన్ అనుసంధానంలో ఇబ్బందులు ఎదురయ్యేలా ఉన్నాయి. రాష్ట్రప్రభుత్వం మొండివైఖరి వీడి ఉద్యోగులతో సంప్రదింపులు జరిపి సమ్మె విరమించే ప్రయత్నాలు చేయకుండా తాత్కాలిక సిబ్బందితో పనులు చేయిస్తే పెద్దఎత్తున నిధులు దుర్వినియోగమయ్యే అవకాశం ఉంది.

# బోధనకు సెలవు.. ఫైళ్లు కదలవు

### బడులపై ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె ప్రభావం

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెతో జనగామ జిల్లాలోని కేజీబీవీలు, భవిత సెంటర్లు, పాఠశాలల్లో బోధనకు ఆటంకం ఏర్పడుతున్నది. మండలాల్లో విద్యావనరుల కేంద్రాలు మూతపడ్డాయి. జిల్లాలోని 12 మండలాల్లో 416 మంది సమగ్ర శిక్షలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎమ్మార్సీ సిబ్బంది సమ్మెలో ఉండడంతో పీఎం పోషణ్ సహా ట్రెజరీకి సంబంధించిన మధ్యాహ్న భోజన బిల్లులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. వంట కార్మికుల బిల్లులను తొలుత మండల విద్యాధికారి కార్యాలయాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్‌లైన్ చేసి ట్రెజరీకి పంపించాలి. ప్రతి మండలంలో దాదాపుగా 50 నుంచి 150 వరకు వంట కార్మికుల అకౌంట్లలోకి బిల్లులు జమ చేయాల్సి ఉంటుంది. అన్ని మండలాల్లో బిల్లులు నిలిచిపోవడంతో మండల విద్యాధికారులు సతమతమవుతున్నారు. మధ్యాహ్న భోజన రైస్ ఇండెంట్ ఆన్‌లైన్ చేసేవారు లేక సేవలన్నీ ఆగి పోయాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి అవసరమైన బియ్యాన్ని మండల లెవల్‌స్టాక్ పాయింట్ నుంచి తీసుకొస్తారు. ఈక్రమంలో మండల విద్యా వనరుల కేంద్రంలో పనిచేసే సీఆర్‌పీ వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. కానీ వీరంతా సమ్మెలో ఉండడంతో పాఠశాల లకు బియ్యం సరఫరా నిలిచిపోయింది. ప్రతి రోజూ విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం వివరాలను డీఈవో కార్యాలయానికి చేరవేయడంలోనూ ఇబ్బందులు తప్పడంలేదు.